
సాక్షి ప్రకాశం

గురువారం । 10 । ఏప్రిల్ । 2025



పల్లె పక్కలో కరువు బల్లెం

పశ్చిమ ప్రకాశంలో పలు మండలాల్లో కరువు ఛాయలు అలుముకున్నాయి. భూగర్భ జలాలు అడుగంటి తాగునీటి సమస్య ఏర్పడింది. పంటలు ఎండిపోయాయి.

- 8లో..



దిగజారిన కనిష్ట ధరలు

పొగాకు కనిష్ట ధరలు దిగజారుతున్నాయి. బుధవారం కనిష్ట ధర రూ.230 పలికింది. దీంతో పొగాకు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
38/25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది.

తీరం ముందుకు.. బతుకులు వెనక్కు!

సాగర తీరం.. ఒక వైపు గంగపుత్రుల జీవితాలకు అండగా నిలుస్తుంది. మరో వైపు పర్యాటక ప్రేమికులకు ఆహ్లాదాన్ని పంచుతుంది. నీలి సంద్రం తరచూ ముందుకు వస్తూ ఇసుక దిబ్బలను మింగేస్తుందా..తీరంలోని భూభాగాన్ని తనలో కలిపేసుకుంటుందా? అంటే అవుననే అనిపిస్తోంది. వాతావరణం మార్పులతో సముద్రతీరం తరుచూ కోతకు గురువుతుండడం ఆందోళనకు గురిచేస్తోంది. పాకల తీరం పరిధిలోని ఊళ్లపాలెం వద్ద తీరం కోతకు గురైంది. దీంతో రొయ్యల చెరువు కట్టలు తెగాయి. ఇలా జరిగితే బోట్లు ఎక్కడ భద్రపరుచుకోవాలోనని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కోతకు గురైన తీరం

- కోతకు గురైన ఊళ్లపాలెం సముద్ర తీరం
- సుమారు 40 మీటర్లు ముందుకు వచ్చిన సముద్రం
- ధ్వంసమైన రొయ్యల చెరువు కట్టలు
- మత్స్యకారుల గుండెల్లో గుబులు
- బోట్ల భద్రతపై ఆందోళన
- తీరానికి దగ్గరగా రూ.20 లక్షలతో రోడ్డు నిర్మాణం
- బోట్లు వెనక్కి జరుపుకోవాలంటే అడ్డుగా ఉన్న రోడ్డు

బోట్ల భద్రతపై ఆందోళన

ఊళ్లపాలెం సముద్రతీరం కొంత కాలంగా రోజూ కోతకు గురవుతుండడంపై మత్స్యకారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీంతో తీరంలోని రొయ్యల చెరువుల కట్టలు ధ్వంసమయ్యాయి. అదే తీరానికి ఉత్తరం వైపు మాత్రం తీరం కోతకు గురి కాలేదని మత్స్యకారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. తరుచూ సముద్రం ముందుకు వస్తుండడంతో బోట్ల భద్రతపై గంగపుత్రులు ఆందోళన చెందుతున్నారు.

సింగరాయకొండ:

జిల్లా పరిధిలో సముద్ర తీరం సుమారు 50 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. కొండపి నియోజకవర్గంలోని టంగుటూరు, సింగరాయకొండ మండలాల పరిధిలో సుమారు 12 కిలోమీటర్లు దూరం తీరం ఉంది. టంగుటూరు మండల పరిధిలో తేటుపురం, తాళ్లపాలెం, కేపపాలెం, సింగరాయకొండ మండల పరిధిలో పాకల పంచాయతీలో పల్లెపాలెం, చెల్లెమ్మగారిపట్టపుపాలెం, పోతయ్యగారి పట్టపుపాలెం, క్రాంతి నగర్, శాంతినగర్, ఊళ్లపాలెం పంచాయతీ పరిధిలో దేవలంపల్లెపాలెం, బేసిన్ పల్లెపాలెం, బావివద్ద పల్లెపాలెం ఉన్నాయి. కొన్ని సంవత్సరాలుగా ఊళ్లపాలెం తీరంలో సముద్రం మార్చి, ఏప్రిల్ మాసంలో సుమారు 10 నుంచి 20 మీటర్లు ముందుకు వస్తుండేది. ఈ సంవత్సరం మాత్రం సుమారు 40 నుంచి 50 మీటర్ల వరకు ముందుకు వచ్చిందని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తీరంలో ఉన్న రొయ్యల చెరువుల కట్టలు కోతకు గురయ్యాయని మత్స్యకారులు తెలిపారు. ఊళ్లపాలెం తీరంలో విచిత్రంగా ఊళ్లపాలెం, పాకల పంచాయతీ లోని పోతయ్యగారి పట్టపుపాలెంకు మధ్య మాత్రమే తీరం భారీగా కోతకు గురికాగా, ఊళ్లపాలెం తీరానికి దక్షిణం వైపు మాత్రం 10 మీటర్లు కోతకు గురైంది.



తీరం కోతకు గురవటంతో తీరానికి దగ్గరగా ఉన్న రోడ్డు

అడ్డంకిగా మారిన రోడ్డు..

ఊళ్లపాలెం తీరంలో నిర్మించిన రోడ్డు బోట్ల భద్రతకు అడ్డంకిగా మారింది. సముద్ర తీరంలో గత ఏడాది అక్టోబర్‌లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు సుమారు రూ.20 లక్షలతో తీరానికి సమాంతరంగా రోడ్డు నిర్మించి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. మొదట రోడ్డును తీరానికి సుమారు 80 మీటర్ల దూరంలో ఏర్పాటు చేద్దామని భావించారు. అయితే తరువాత ఇంజినీరింగ్ అధికారులు తీరానికి సుమారు 50 మీటర్ల దూరంలోనే నిర్మించాలని సూచించారు. ఇంజినీరింగ్ అధికారుల నిర్ణయాన్ని మత్స్యకారులు అప్పట్లో వ్యతిరేకించారు. అధికార టీడీపీ నాయకుల ఒత్తిడితో ఏమీ చేయలేక ఊరుకున్నారు. దీనికి తోడు అధికార పార్టీ నాయకులే ఈ రోడ్డు నిర్మించారని ఆరోపణలు ఉన్నాయి. ఈ రోడ్డు నిర్మాణం విషయమై తనకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని గ్రామ సర్పంచ్ పాకనాటి అనసూర్యమ్మ ఆరోపించారు. గ్రామంలో టీడీపీ నాయకుల ఇష్టప్రకారమే పనులు జరిగాయన్నారు. ఈ రోడ్డు కారణంగా తీరంలో బోట్లు వెనక్కి జరుపుకోలేక మత్స్యకారులు అవస్థలు పడుతున్నారు. బోట్లు భద్రపరుచుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని వారు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

నాసిరకంగా రోడ్డు నిర్మాణం

రోడ్డు నాసిరకంగా నిర్మించారని, నిబంధనల ప్రకారం క్యూరింగ్ కూడా చేయలేదన్న ఆరోపణలు ఉన్నాయి. అంతేకాక రోడ్డు మార్జిన్లు కూడా తూతూ మంత్రంగా వేశారని, చిన్న వర్షానికి అవి ధ్వంసం అయ్యే ప్రమాదం ఉందని, కేవలం ధనార్జనే ధ్యేయంగా రోడ్లు నిర్మించారని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు.

న్యూస్‌రీల్

ఆ భూమి మనదే.. పనులు చేయండి

- ఆర్డీఓ కేశవర్ధనరెడ్డి



సీబీజీకి కేటాయించిన భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ కేశవర్ధనరెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

కురిచేడు: సీబీజీ (కంప్రెస్డ్ బయో గ్యాస్) ప్లాంట్ ఏర్పాటుకు రిలయన్స్ కంపెనీకి కేటాయించిన భూమి రెవెన్యూదే అని, దానిని చదును చేయాలని, పనులు ఆపవద్దని కనిగిరి ఆర్డీఓ జీ కేశవర్ధనరెడ్డి ఆదేశించారు. 'సీబీజీ భూముల కేటాయింపులో అత్యుత్సాహం' అన్న శీర్షికన బుధవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆర్డీఓ గంగదొనకొండ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 88, 90 లో కేటాయించిన 799.40 ఎకరాల స్థలాన్ని ఆయన పరిశీలించి ఆ భూమి రెవెన్యూదే అని నిర్ధారించారు. అయితే ఆ సమయంలో అటవీశాఖ అధికారులు ఎవరూ హాజరు కాలేదు. వారి అంగీకారం లేకపోవటంతో మళ్లీ అటవీశాఖ అధికారులు ఏం పేచీపెడతారో తెలియటం లేదు. ఇరు శాఖల అధికారుల సమక్షంలో జాయింట్ సర్వే చేసి హద్దులు నిర్ణయించకపోతే ఈ పరిస్థితి ఇలాగే కొనసాగుతుందని తెలిసి కూడా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవటం గమనార్హం. ఈ పరిశీలనలో ఆర్డీఓ వెంట సర్వేయరు గోపి, వీఆర్వో హనుమంతరావు, సిబ్బంది ఉన్నారు.

నేషనల్ క్రికెట్ టీంకి ఎంపికైన షేక్ కాలేషా

- నేపాల్‌లో మే 26 నుంచి 31 వరకు ఆడనున్న కాలేషా



నేషనల్ టీంకు ఎంపికైన షేక్ కాలేషా

దర్శి: ఇంటర్నేషనల్ ఇండో-నేపాల్ కప్ 2025 చాంపియన్ షిప్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఇండియా తరపున ఆడేందుకు దర్శికి చెందిన షేక్ కాలేషా ఎంపికయ్యారు. నైన్ ఏ సైడ్ క్రికెట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంట్‌లో షేక్ కాలేషాను నేషనల్ టీంకు ఎంపిక చేశారు. ఈ మేరకు ఆ సంస్థ నుంచి కాలేషాకు ఉత్తర్వులు అందజేశారు. మే 26 నుంచి 31 వరకు నేపాల్‌లో ఈ చాంపియన్ షిప్ పోటీలు జరుగుతాయి. ఆల్ రౌండర్ ఆటగాడిగా కాలేషా ఇప్పటి వరకు రాణిస్తున్నారు. కాలేషా ఎంపిక కావడం పై పలువురు అభినందనలు తెలిపారు.

మెరిట్ కం రోస్టర్ విధానంలోనే పదోన్నతులివ్వాలి



ఒంగోలులో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఒంగోలు సిటీ: మెరిట్ కం రోస్టర్ విధానంలోనే ఉపాధ్యాయుల పదోన్నతులు ఇవ్వాలని కోరుతూ బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బుధవారం ఎస్ఎస్‌సీ స్పాట్ కేంద్రాల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఆమేరకు ఒంగోలు డీఆర్ఆర్ఎం హైస్కూల్ దగ్గర నిరసన తెలిపారు. జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కర్ర దేవసహాయం మాట్లాడుతూ ప్రభుత్వం ప్రస్తుతం ప్రకటించిన ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా కేవలం మెరిట్ ఆధారంగా తయారు చేశారని అది తగదన్నారు. కార్యక్రమంలో పీ నాగేశ్వరరావు, హనుమంతరావు, డేవిడ్‌రాజు, మనోహరరావు, వెంకట్రావు, కల్యాణ్, పాపారావు, భాస్కరరావు పాల్గొన్నారు.

'దిశ'లో సమస్యల ఏకరువు

- దిశ తొలి సమావేశంలోని తీర్మానాల అమలు ఎక్కడ
- సమస్యలు చెప్పటమే కానీ పరిష్కారం లేదని సభ్యుల అసహనం
- ఎమ్మెల్యే తాటిపర్తికి సమాచారం ఇవ్వలేదని వైఎస్సార్ సీపీ సభ్యుల ఆగ్రహం
- కేవలం ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే సమావేశానికి హాజరు



దిశ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, పక్కన కలెక్టర్, జేసీ

ఒంగోలు సబర్బన్: జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం (దిశ)లో సమస్యలపై సభ్యులు ఏకరువు పెట్టారు. సమావేశంలో సమస్యలు చెప్పటం మినహా అవి మాత్రం పరిష్కారానికి నోచుకోలేదని సమావేశంలో ప్రశ్నించారు. మొదటి దిశ సమావేశంలోని తీర్మానాలకే అతీగతీ లేదని ధ్వజమెత్తారు. అప్పట్లో చేసిన తీర్మానాలను అమలు చేయలేదని వైఎస్సార్ సీపీ సభ్యులు చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రకాశం భవన్‌లోని గ్రీవెన్స్ హాలులో బుధవారం ఒంగోలు ఎంపీ, దిశ చైర్మన్ మాగుంట శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఈ సమావేశంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ సభ్యులు జిల్లాలోని కేంద్ర ప్రభుత్వ పథకాలపై అలసత్వాన్ని నిలదీశారు. వైఎస్సార్‌సీపీ సభ్యుల పట్ల అధికారులు పక్షపాత ధోరణి అవలంబిస్తున్నారన్నారు. తొలుత ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు వచ్చినందుకు కలెక్టర్ తమీమ్ అన్సారియాను ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా అవసరమైన ముందస్తు చర్యలు పటిష్టంగా చేపట్టాలని ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టర్, దిశ వైస్ చైర్మన్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి 22 వ తేదీ వరకు 15 రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా 7వ పౌష్టికాహార పక్షోత్సవాలు (పోషణ్ పక్వాడా) రోజుకు ఒక కార్యక్రమంతో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని, దాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ నగరంలోని పోతురాజుకాలువ, నల్ల కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యేలు ఉగ్ర నరసింహారెడ్డి, బీఎన్ విజయకుమార్ మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జేసీ రోణంకి గోపాల కృష్ణ, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఆర్ఓ చిన ఓబులేసు, సీపీఓ వెంకటేశ్వర రావు, డ్వామా పీడీ జోసెఫ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాల శంకర రావు, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, పబ్లిక్ హెల్త్ ఈఈ శ్రీనివాస సంజయ్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వర రావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

మర్రిపూడి-పొదిలి రోడ్డు అధ్వానంగా ఉంది

మర్రిపూడి-పొదిలి రోడ్డులో 12 కిలో మీటర్ల ప్రయాణానికి అర్ధ గంటపైగా సమయం పడుతోంది. రోడ్డు మరీ అధ్వానంగా మారింది. గతంలో కూడా సమావేశాల్లో ప్రస్తావించినా ప్రయోజనం లేదు. మర్రిపూడి సెంటర్‌లో 90 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంకు కూలిపోయే స్థితిలో ఉంది. దాన్ని కడిగి ఎన్ని సంవత్సరాలైందో. ట్యాంకు పైకి ఎక్కడానికి భయపడుతున్నారు. అదే నీళ్లు ప్రజలకు సరఫరా చేస్తున్నారు.

– వాకా వెంకట రెడ్డి, వైఎస్సార్ సీపీ ఎంపీపీ, మర్రిపూడి

యర్రగొండపాలెం ఎమ్మెల్యేకు సమాచారం లేదు

వైఎస్సార్ సీపీ యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌కు దిశ సమావేశానికి సంబంధించిన సమాచారం కూడా ఇవ్వలేదు. వైఎస్సార్ సీపీకి చెందిన జెడ్పీటీసీలకు, ఎంపీపీలకు కూడా సమాచారం ఇవ్వలేదు. అంటే అధికారులకు అధికార పార్టీ ఎమ్మెల్యేలంటే ఒక విధంగా, ప్రతిపక్ష ఎమ్మెల్యేలూ, సభ్యులంటే మరోవిధంగా చూస్తారా. శ్మశానాల అభివృద్ధి గురించి గతంలో ప్రస్తావించినా వాటిని పట్టించుకోలేదు. త్రిపురాంతకం మండలంలో జేజేఎం పథకం వల్ల ప్రయోజనం లేదు. బోర్లు 1000 అడుగుల లోతుకు వెళ్లిపోయాయి. బోర్లు బాగు చేయాలి. మండలంలో లబ్ధిదారులకు తెలియకుండానే ఇళ్లు మంజూరు చేసి బిల్లులు కూడా తీసుకున్నారు. దీనిపై విచారణ చేయాలని కోరినా ఫలితం లేదు.

– మాకం జాన్ పాల్, వైఎస్సార్ సీపీ త్రిపురాంతకం జెడ్పీటీసీ సభ్యుడు

చదలవాడ చెరువు తెగింది

మండలంలోని చదలవాడ చెరువు తెగింది. రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. జనరల్ బాడీ సమావేశానికి విద్యుత్ శాఖ అధికారులు రావటం లేదు. ఎన్నిసార్లు జెడ్పీ సమావేశంలో చెప్పినా ప్రయోజనం లేదు. పోతవరానికి మంచినీళ్లు రావటం లేదు. కనపర్తిలో మంచినీటి ట్యాప్‌లు పనిచేయటం లేదు. ఒంగోలు నగరంలో ట్యాప్‌ల్లో మురికి నీరు వస్తోంది.

– నలమలపు అంజమ్మ, నాగులుప్పలపాడు ఎంపీపీ

ఉపాధ్యాయుల సీనియారిటీని పారదర్శకంగా ఇవ్వాలి

ఒంగోలు సిటీ: ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను పారదర్శకంగా తయారు చేసి పదోన్నతులు ఇవ్వాలని యూటీఎఫ్ ప్రతినిధులు డీఈఓ ఏ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. స్థానిక డీఈఓ కార్యాలయం వద్ద యూటీఎఫ్ ప్రకాశం జిల్లా శాఖ ప్రతినిధులు బుధవారం డీఈఓను కలిసి ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల విషయమై చర్చించి, మెమొరాండం అందించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజీ శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్, డీ వీరాంజనేయులు, ఎస్ రవి, జీ ఉమామహేశ్వరి, ఎన్ చినస్వామి, బాలవెంకటేశ్వర్లు, నల్లూరి వెంకటేశ్వర్లు, ఎం సంధ్యారాణి, ప్రభాకర్‌రెడ్డి, ఎస్వీ కొండారెడ్డి, ఉమామహేశ్వరరావు, డీ జోత్స్న, రమణమూర్తి, ఆర్ నారాయణ, లక్ష్మీనారాయణ, దార్ల శ్రీను, కే హనుమంతరావు, చంద్రశేఖరయ్య, జిలానీ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఫ్యాప్టో ఆధ్వర్యంలో వినతిపత్రం

మే నెలలో నిర్వహించబోయే ఉపాధ్యాయుల పదోన్నతుల జాబితా మెరిట్ కం రోస్టర్ విధానంలో తయారు చేయాలని డీఈఓకు ఫ్యాప్టో ప్రతినిధులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ కే ఎర్రయ్య, ఎండీ రఫీ, కో చైర్మన్‌లు వీ మాధవరావు, జయరావు, అబ్దుల్‌హై, వీ జనార్దన్, డీ శ్రీనివాసులు, చల్లా శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇంగ్లిషు సిలబస్ భారం తగ్గించండి

- డీఈఓకు వినతిపత్రం అందించిన ఏపీ ఇంగ్లిష్ ఫోరం ప్రతినిధులు

ఒంగోలు సిటీ: ప్రస్తుతం ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు బోధిస్తున్న ఇంగ్లిషు సబ్జెక్టు సిలబస్ భారంగా ఉందని, దానిని తగ్గించాలని ఇంగ్లిషు ఫోరం ప్రతినిధులు డీఈఓ ఏ కిరణ్‌కుమార్‌ను కలసి వినతిపత్రం అందించారు. బుధవారం ఒంగోలు డీఈఓ కార్యాలయం వద్ద ఆయన్ను కలసిన ఫోరం సభ్యులు పదో తరగతి పాఠ్యాంశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని, వాటి భారం తగ్గిస్తే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ఇంగ్లిషు భాష పట్ల ఆసక్తిని పెంపొందించుకోవడానికి వీలుగా ఉంటుందని చెప్పారు. పదో తరగతి ఇంగ్లిషు సబ్జెక్టులో ఉన్న తొమ్మిది పాఠ్యాంశాలను ఆరుకు కుదించి, వర్క్ బుక్‌ను ఐచ్ఛికంగా ఉంచితే ఇంగ్లిషు సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం డిసెంబర్‌లో విడుదల చేసిన పదో తరగతి షెడ్యూల్ ప్రకారం స్టడీ అవర్స్ నిర్వహించే సమయానికి సిలబస్ పూర్తి కావడం లేదని వాపోయారు. సిలబస్‌ను కుదించినట్లయితే షెడ్యూల్ ప్రకారం స్టడీ అవర్స్ నిర్వహించి విద్యార్థులను పరీక్షలకు అన్ని విధాలుగా సంసిద్ధులుగా ఉంచగలుగుతామన్నారు. కార్యక్రమంలో ఏపీ ఇంగ్లిషు ఫోరం సభ్యులు శ్రీరాం శ్రీనివాసరావు, మరియరాజు, బుర్ల కోటేశ్వరరావు, శరత్‌చంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తాము ఇచ్చిన మెమొరాండంను విద్యాశాఖ కమిషనర్‌కు పంపించాలని వారు కోరారు.



డీఈఓ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏపీ ఇంగ్లిషు ఫోరం సభ్యులు

అట్టహాసంగా ప్రభ తరలింపు

- వైఎస్సార్ సీపీ ప్రభ తరలింపునకు భారీగా తరలివచ్చిన ప్రజలు
- పాల్గొన్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ



వైఎస్సార్‌సీపీ ప్రభ తరలింపులో ఎడ్లబండిపై బూచేపల్లి శివప్రసాదరెడ్డి, నాయకులు



ప్రజలకు అభివాదం చేస్తున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి, వెంకాయమ్మ



వైఎస్సార్‌సీపీ ప్రభ తరలింపునకు భారీగా తరలివచ్చిన ప్రజలు

చీమకుర్తి రూరల్: మండలంలోని రామతీర్థం పుణ్యక్షేత్రంలో ఈనెల 12న జరిగే గంగమ్మ తిరునాళ్ల సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభ తడిక తరలింపు బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. భారీగా తరలి వచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు, స్థానిక ప్రజలు వెంటరాగా బాణసంచాలు, డప్పుల మోతలతో చీమకుర్తిలోని బూచేపల్లి కళ్యాణ మండపం దగ్గర నుంచి రామతీర్థం నిధిలోకి ప్రభ తడికను ఊరేగింపుగా తరలించారు. కార్యక్రమానికి బూచేపల్లి శివప్రసాదరెడ్డితో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రతి గ్రామం నుంచి అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, పట్టణ పార్టీ అధ్యక్షుడు కిష్టపాటి శేఖర్‌రెడ్డి, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపువరపు రాజ్యలక్ష్మి పూర్ణచంద్ర, గంగిరెడ్డి ఓబులరెడ్డి, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, కౌన్సిలర్లు ఇందిరా సుందరరామిరెడ్డి, పాటిబండ్ల గంగయ్య, బాబురావు, యల్లయ్య, ప్రమీల రామబ్రహ్మం, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, బూచేపల్లి అభిమానులు పాల్గొన్నారు.

రేపు పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ సమావేశం

ఒంగోలు సబర్బన్: జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ సమావేశం ఈ నెల 11వ తేదీ నిర్వహించనున్నట్లు జిల్లా పరిశ్రమల అధికారి బి.శ్రీనివాస రావు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ ఏడాది ఫిబ్రవరి 13వ తేదీ నిర్వహించిన సమావేశంలో పరిశ్రమల స్థాపనకు ఎదురయ్యే సమస్యలపై కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా సమక్షంలో చర్చించారన్నారు. ప్రతి నెలలో రెండో శుక్రవారం డీఐఈపీసీ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. అందులో భాగంగా ఈనెల 11న కలెక్టర్ సూచనల మేరకు సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో సమస్యలను చర్చించేందుకు పారిశ్రామికవేత్తలకు అవకాశం కల్పించారని వివరించారు. పూర్తి వివరాలకు జిల్లా పరిశ్రమల అధికారి బి.శ్రీనివాస రావు సెల్: 9912851975 కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చన్నారు.

క్లుప్తంగా

గ్రామవ్యవసాయ సహాయకునిపై దాడి

మద్దిపాడు: మండలంలోని అంకేపల్లి గ్రామ సచివాలయంలో గ్రామవ్యవసాయ సహాయకునిగా విధులు నిర్వహిస్తున్న ఈర్ల చినబాబుపై ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ఆకస్మిక దాడి చేశారు. ఈ సంఘటన అంకేపల్లి గంగమ్మ గుడికి సమీపంలో బుధవారం జరిగింది. బంధువులు తెలిపిన వివరాలు మేరకు... మండలంలోని కూచిపూడి గ్రామానికి చెందిన ఈర్ల చినబాబు మండలంలోని అంకేపల్లి గ్రామ సచివాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకునిగా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం తన సొంత గ్రామమైన కూచిపూడి నుంచి ద్విచక్రవాహనంపై విధులు నిర్వహించేందుకు అంకేపల్లి సచివాలయానికి బయలుదేరాడు. అంకేపల్లి గంగమ్మ దేవాలయం సమీపంలోకి రాగానే ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు మాస్కులు ధరించి అటకాయించి ఇనుప రాడ్లతో విచక్షణా రహితంగా దాడి చేశారు. దాడిలో చినబాబు కుడికంటికి తీవ్ర గాయమైంది. శరీరంపై రక్త గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని ఒంగోలు జీజీహెచ్‌కి తరలించినట్లు బంధువులు తెలిపారు.

దిగజారిన కనిష్ట ధరలు

- ఆందోళన చెందుతున్న పొగాకు రైతులు
- అధిక సంఖ్యలో తిరస్కరణకు గురవుతున్న బేళ్లు



వేలం నిర్వహిస్తున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

టంగుటూరు: పొగాకు కనిష్ట ధరలు దిగజారుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది వేలం ప్రారంభంలో కనిష్ట ధర రూ.260 వరకు పలికింది. అయితే గత వారం రోజులుగా ధర తగ్గుతూ బుధవారం కనిష్ట ధర రూ.230 పలికింది. పొగాకు కంపెనీల ప్రతినిధులు బోర్డు అధికారులతో కుమ్మక్కై అన్ని కంపెనీలు వేలం పాల్గొనడం లేదు. దీంతో వేలంలో పాల్గొన్న కంపెనీలు ధరలను తగ్గించేస్తున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పొలం, బ్యార్నీ కౌలు, కూలీ ధరలు పెరగడంతో సాగు ఖర్చు రెట్టింపయింది. ఈ పరిస్థితుల్లో గత ఏడాది కంటే మెరుగైన ధరలు వస్తేనే పొగాకు రైతులు గట్టెక్కేది. కానీ వేలం ప్రారంభం నుంచి ధరల్లో పెరుగుదల లేకపోగా ఉన్న ధరలను తగ్గించడంతో రైతులు నష్టపోతున్నారు.

పొగాకు బోర్డు ఉన్నతాధికారులు వారానికి ఒక సారి వచ్చి వేలం కేంద్రాన్ని, వేలం ప్రక్రియను తూతూమంత్రంగా పరిశీలించి వెళుతున్నారే తప్ప ధరలపై శ్రద్ధ చూపడం లేదని రైతులు వాపోతున్నారు. బుధవారం వేలం కేంద్రానికి చింతలపాలెం, దావగూడూరు గ్రామాలకు చెందిన రైతులు 521 బేళ్లను వేలానికి తీసుకురాగా 371 బేళ్లను కొనుగోలు చేసి 150 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.230, సరాసరి రూ.254.95గా నమోదైంది. వేలంలో 19 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

పల్లె పక్కలో కరువు బల్లెం!

పశ్చిమ ప్రకాశంలోని పలు మండలాల్లో కరువు ఛాయలు అలుముకున్నాయి. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడింది. గత మూడు నెలలుగా వర్షం లేక పంటలు నిలువునా ఎండిపోవడంతో పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఏర్పడింది. వేసిన పంటలన్నీ దాదాపు ఎండిపోయాయి. మరోవైపు పశువులకు కూడా గ్రాసం కొరత ఏర్పడింది.

- పశ్చిమ ప్రకాశంలో లోటు వర్షపాతం నమోదు
- ఎండిపోయిన పంటలు
- ఆశించని స్థాయిలో రాని దిగుబడి
- అడుగంటిన భూగర్భజలాలు
- తాగునీటి కోసం ప్రజల అవస్థలు
- పశుపోషకులను వేధిస్తున్న గ్రాసం కొరత



యాచవరంలో ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న గ్రామస్తులు



కంభం మండలంలో ఎండిపోయిన మొక్కజొన్న

మార్కాపురం/తర్లుపాడు/కొనకనమిట్ల:

రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించిన జాబితాలో మార్కాపురం, కొనకనమిట్ల, రాచర్ల, బేస్తవారపేట, తర్లుపాడు, కంభం, పుల్లలచెరువు, పెద్దారవీడు తదితర మండలాలున్నాయి. ఇందులో తీవ్రమైన కరువున్న మండలాలు పుల్లలచెరువు, కంభం, తర్లుపాడు, పెద్దారవీడు, బేస్తవారపేట మండలాలు ఉండగా ఒక మోస్తరుగా కరువు మండలాలు కొనకనమిట్ల, మార్కాపురం, రాచర్ల ఉన్నాయి. గత మూడు నెలలుగా వర్షపాతం లేకపోవడంతో రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలన్నీ దిగుబడులు రాలేదు. పెట్టిన పెట్టుబడి వ్యయం కూడా రైతులకు రాలేదు. మరోవైపు గత ఏడాది డిసెంబరు నుంచి వర్షపాతం లేకపోవడంతో రబీలో సాగుచేసిన మినుము, పప్పుశనగ, కంది, అలసంద పైర్లతో పాటు చివరిదశలో ఉన్న మిర్చి పంట దిగుబడి కూడా తగ్గిపోయింది. దీనికి తోడు గిట్టుబాటు ధర లేకపోవడం, పెట్టుబడి ఖర్చులు చేతికొచ్చే పరిస్థితి కానరాక రైతులు విలవిల్లాడిపోతున్నారు. 2023 నవంబర్, డిసెంబర్‌లో ప్రకృతి వైపరీత్యాలకు ఇవ్వాల్సిన నష్టపరిహారంతోపాటు 2024 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి పంట నష్టపరిహారం ఇంతవరకు ప్రభుత్వం రైతులకు ఇవ్వలేదు. వ్యవసాయం కోసం అప్పులు చేసిన రైతులు వడ్డీలు కట్టలేక మనోవేదనకు గురవుతున్నారు.

లోటు వర్షపాతం

నెల	మార్కాపురం		తర్లుపాడు	
	కురవాల్సిన వర్షం	కురిసిన వర్షం	కురవాల్సిన వర్షం	కురిసిన వర్షం
నవంబరు	92.3 మి.మీ	18 మి.మీ	102.7 మి.మీ	10.4మి.మీ
డిసెంబరు	29.2 మి.మీ	45.4మి.మీ	24.7మి.మీ	70.8మి.మీ
జనవరి	6.8మి.మీ	0 మి.మీ	8.7 మి.మీ	0.మి.మీ
ఫిబ్రవరి	5.9 మి.మీ	0 మి.మీ	5.5 మి.మీ	0.మి.మీ

అడుగంటుతున్న బోర్లు

మార్కాపురం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడుతోంది. దీనితో ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేస్తున్నారు. మార్కాపురం మండలంలోని 4 పంచాయతీల్లో, కొనకనమిట్ల మండలంలోని 3 పంచాయతీల్లో, దోర్నాల మండలంలోని 6 పంచాయతీల్లో, పెద్దారవీడు మండలంలోని 9 పంచాయతీల్లో పుల్లలచెరువు మండలంలోని 4 పంచాయతీల్లో, తర్లుపాడు మండలంలోని పలు గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. ముఖ్యంగా మార్కాపురం మండలంలోని తిప్పాయిపాలెం, బిరుదులనరవ, రాయవరం గ్రామాల్లో ట్యాంకర్లతో నీటిని తోలుతున్నారు. పెద్దయాచవరం గ్రామంలో కూడా తాగునీటి సమస్య ఏర్పడింది. తర్లుపాడు మండలంలో తుమ్మలచెరువు, గానుగపెంట, ఒబాయపల్లి, పోతలపాడు, కలుజువ్వలపాడు తదితర గ్రామాల్లో నీటి సమస్య వేధిస్తోంది. పొదిలి మండలంలోని జువ్వలేరు, కొండాయపాలెం గురుగుపాడు గ్రామాల్లో నీటి సమస్య తలెత్తగా ట్యాంకర్ల ద్వారా అరకొరగా నీరు సరఫరా చేస్తున్నారు. ఇదిలా ఉండగా మార్కాపురం మండలంలోని వేములకోట, రాయవరం, నాగులవరం, గజ్జలకొండ, తిప్పాయపాలెం, కొనకనమిట్ల మండలంలోని పలు చెరువులు ఒట్టిపోయాయి.

దిగుబడిపై తీవ్ర ప్రభావం

కంభం: మండలంలో అవసరమైన సమయంలో వర్షం కురవకపోవడంతో శనగ, కంది, మినుము పంటలు పూత దశలో దెబ్బతిని పంట దిగుబడి తగ్గిపోయింది. మండలంలో ఈ ఏడాది శనగ 3589 ఎకరాలు, మొక్కజొన్న 359 ఎకరాలు, కంది 372 ఎకరాలు, మిర్చి 144 ఎకరాలు, జొన్న 73 ఎకరాలు, పొగాకు 306 ఎకరాల్లో సాగుచేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో బోర్లలో నీరందక మొక్క జొన్నపంట ఎక్కువ శాతం దెబ్బతింది. పూత దశలో శనగ ఉండగా అధిక వర్షం కురవడంతో 7 క్వింటాళ్లు రావలసిన దిగుబడి 4 క్వింటాళ్లకు పడిపోయింది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో 3–4 క్వింటాళ్లు రావాల్సిన దిగుబడి 1.5 క్వింటాళ్లకు పడిపోయింది. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో బోర్లలో నీరు తగ్గి బత్తాయి, అరటి తోటలకు నీటి సమస్య తలెత్తింది. మండలంలోని ఎల్‌కోట పంచాయతీ పరిధిలోని సూరేపల్లిలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ఎండిపోయిన పంటలు

కరువు మండలాలుగా ప్రకటించిన గ్రామాల్లో రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలు వర్షాభావ పరిస్థితుల వలన ఎండిపోయాయి. ఎక్కువగా మినుము, పప్పుశనగ, కంది, అలసందతోపాటు బొప్పాయి, జామ, బత్తాయి రైతులు నష్టపోయారు.

పంట	మార్కాపురం సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	తర్లుపాడు సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	కొనకనమిట్ల సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
మినుము	290	560	1959
పప్పుశనగ	972	561	190
అలసంద	138	213	3929

రబీ సీజన్‌లో తీవ్ర నష్టం

బేస్తవారిపేట: వేసిన పంటలన్నీ కళ్ల ముందే ఎండిపోయి రైతులు ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. అకాల వర్షాలు, తెగుళ్ల ఉధృతితో సాగుకు అయిన ఖర్చు కూడా రాక నష్టాలు మిగిలాయి. బేస్తవారిపేట మండలంలో ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో పంటలకు నష్టం జరిగితే కేవలం రబీ సీజన్‌కే తీవ్ర కరువు మండలంగా ప్రకటించారు. ఖరీఫ్ సీజన్‌లో నష్టపోయిన పంట వివరాలను ప్రభుత్వానికి వ్యవసాయశాఖ అధికారులు పంపినా నేటికీ పట్టించుకోలేదు. రబీ సీజన్‌లో బేస్తవారిపేట మండలంలో వరి 25 హెక్టార్లు, కంది 12, అలసంద 25, మినుము 252, పొగాకు 253, వేరుశనగ 9, రాగి 61, నువ్వులు 58, జొన్న 68, మొక్కజొన్న 1006, వరిగ 73, శనగ 752, సజ్జలు 31, ఉలవలు 30 హెక్టార్లలో దెబ్బతింది. మొత్తం 3,656 మంది రైతులు 2,669 హెక్టార్లలో పంట నష్టపోయినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. అక్టోబర్‌లో 200 ఎంఎం వర్షపాతానికి 169, నవంబర్‌లో 89కి 17, డిసెంబర్‌లో 29కి 97, జనవరిలో 7.1కి, ఫిబ్రవరిలో 0.8కి, మార్చి నెలలో 10.2కి జీరో, ఏప్రిల్‌లో 30కి 26.8 ఎంఎం వర్షపాతం నమోదైంది. సకాలంలో వర్షం పడకపోవడం, పంటలు లేత దశలో ఉన్నప్పుడు ఎక్కువగా పడటంతో పంటలకు తీవ్ర నష్టం జరిగింది.



వర్షాభావంతో ఎండుముఖం పట్టిన బత్తాయి తోట



నీళ్లు లేని రాయవరం చెరువు



నీరు లేక దిగుబడి రాని మినుము

నీరు లేక తోట ఎండిపోతోంది



మూడున్నర ఎకరాల్లో బత్తాయి తోట సాగుచేశాం. గత రెండు నెలల నుంచి వర్షాలు లేకపావడంతో బోర్లలో నీరు సరిగా రావడం లేదు. ఎకరాకు నీరు పెట్టేందుకు 3 రోజులు పడుతోంది. పంటకు పెట్టిన పెట్టుబడి చేతికొచ్చే పరిస్థితి అనుమానమే. నీరు లేనట్లయితే కాయ ఊరదు.

– కె రంగలక్ష్మి, నాయుడుపల్లి

గంజాయి విక్రేతల అరెస్టు

- ముగ్గురు నిందితుల నుంచి 2 కేజీ గంజాయి, బైకు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మార్కాపురం డీఎస్పీ నాగరాజు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు, పక్కన సీఐ, ఎస్సైలు

మార్కాపురం: మార్కాపురం పట్టణ శివారులో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి సుమారు 2 కిలోల గంజాయి, ఒక బైకును స్వాధీనం చేసుకున్నట్లు మార్కాపురం డీఎస్పీ డాక్టర్ నాగరాజు తెలిపారు. బుధవారం డీఎస్పీ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడించారు. గంజాయి విక్రయాన్ని కట్టడి చేసేందుకు మార్కాపురం సీఐ పి.సుబ్బారావు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో సీఐకి అందిన సమాచారం మేరకు ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మలిపెద్ది ప్రభావతి, పట్టణ ఎస్సైలు సైదుబాబు, డాక్టర్ రాజ మోహన్‌రావు, రూరల్ ఎస్సై అంకమరావుతో కూడిన బృందంతో ఎస్టేట్ ఏరియాలోని నిర్మానుష్య ప్రాంతానికి వెళ్లారు. వీరిని చూసి అక్కడ ఉన్న ముగ్గురు వ్యక్తులు పారిపోతుండగా అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితుల వద్ద ప్లాస్టిక్ కవర్‌లో 2 కిలోల గంజాయి లభ్యమైంది. పట్టణంలోని జగదీశ్వరి థియేటర్ వద్ద నివాసముండే సుంకర మధు, వెంకట గోపీనాథ్ అరకు ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసి మార్కాపురం తీసుకొచ్చినట్లు విచారణలో వెల్లడైంది. వారు తన మిత్రులైన పట్టణంలోని కరెంటు ఆఫీసు వెనుక ఉండే పాడి తిరుమలయ్య, మీనా మసీదు వద్ద ఉండే ఎస్‌కే ఇమ్రాన్‌కు గంజాయి అమ్మేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో పోలీసులకు చిక్కారు. ఈ ముఠా గంజాయి రవాణా చేసేందుకు ఉపయోగించిన బైకును కూడా స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

త్వరలోనే మరికొందరు గంజాయి విక్రేతలు, వినియోగదారులను అరెస్టు చేస్తామని చెప్పారు. బెట్టింగ్ యాప్‌ల విషయంలో యువత అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్ బెట్టింగ్‌తో ఆర్థికంగా చితికిపోయి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని డీఎస్పీ సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తనను తరచూ పరిశీలించాలని చెప్పారు. నిందితులను అరెస్టు చేయడంలో కృషి చేసిన సీఐ, ఎస్సైలను డీఎస్పీ అభినందించారు.

ప్రభుత్వ బోరు.. టీడీపీ నేత చేనుకు నీరు!



ప్రభుత్వ బోరు నుంచి పైప్ లైన్‌తో నీటి తరలింపు

కొనకనమిట్ల: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో డీప్ బోరు నీటిని స్థానిక టీడీపీ నాయకుడు తన సొంతానికి వినియోగించుకోవడం చర్చనీయాంశమైంది. ఎంపీడీఓ కార్యాలయ వెనుక భాగంలోని డీప్ బోరు నుంచి టీడీపీ నేత సాగు చేస్తున్న పొగాకు తోటకు నేరుగా పైపులు పరిచి నీరు వాడుకుంటున్నారు. గత కొద్ది రోజులుగా ఈ తంతు సాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై సోషల్ మీడియాలో చర్చ నడుస్తోంది. డీప్ బోర్ సమీపంలో ఎంపీడీఓతోపాటు తహసీల్దార్ కార్యాలయం, రైతు సేవా కేంద్రం, వ్యవసాయాధికారి కార్యాలయం ఉన్నా టీడీపీ నేతను ఎవరూ ప్రశ్నించలేదు. పొగాకు తోటకు నీరు అత్యవసరమైన పక్షంలో అధికారుల అనుమతి తీసుకోవాలి కానీ ఇష్టారీతిగా డీప్ బోరును ఎలా వినియోగించుకుంటారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఎంపీడీఓను వివరణ కోరగా.. డీప్ బోరును వినియోగించుకుంటున్న విషయం తన దృష్టికి రాలేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

హామీల అమలుపై కూటమి కప్పదాట్లు

- ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ వర్కర్స్ యూనియన్ నాయకుల విమర్శ



మాట్లాడుతున్న బాల వెంకట్

పొదిలి: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని కూటమి నాయకులు ఇచ్చిన హామీని అమలు చేయాలని ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెన్నా బాల వెంకట్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ విమర్శించారు. అధికారంలోకి రాగానే కార్మికులకు ఇచ్చిన హామీలను కూటమి నేతలు మరిచిపోవడం శోచనీయమన్నారు. బుధవారం స్థానిక ఎన్‌జీఓ హోంలో సంఘ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కూటమి నేతలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, గత ఐదేళ్లుగా జిల్లా లేబర్ కార్యాలయాలకు చెల్లించాల్సిన బకాయిలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే నిధులు మంజూరు చేసి పెండింగ్ క్లెయిమ్‌లు పరిష్కరించాలని కోరారు. ప్రతి కార్మికుడికి ఇల్లు మంజూరు చేసి, బ్యాంకు రుణం ఇప్పించాలన్నారు. కార్మిక సంఘం ఆధ్వర్యంలో సమస్యలపై తహసీల్దార్, కలెక్టర్, మంత్రులు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకవెళ్లినా వాటి గురించి ప్రస్తావించకపోవడం కార్మికులను మోసం చేయడమేనన్నారు. కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 24న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో హాజరై ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జె.సురేష్, ఎ.శ్రీనివాసులు, భావన్నారాయణ, ఎన్.శ్రీను, వెంకట్, శ్రీను, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా

- ముగ్గురు కూలీలకు తీవ్ర గాయాలు

కొమరోలు : విద్యుత్ సామగ్రితో వెళుతున్న ట్రాక్టర్ బోల్తాపడడంతో ముగ్గురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని ఇడమకల్లు క్రాస్‌రోడ్డు వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగింది. రాజుపాలెం గ్రామసమీపంలో కరెంట్ పనులు చేస్తున్న నేపథ్యంలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన కూలీలువెళుతుండగా ప్రమాదం సంభవించింది. ప్రమాదంలో విశ్వజిత్‌మారి, నిరంజన్‌గోక్, సుభాష్‌గోక్ తీవ్రంగా గాయపడగా మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. 108 వాహనంలో క్షతగాత్రులను గిద్దలూరులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు.



గిద్దలూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



రహదారిపై బోల్తాపడిన ట్రాక్టర్

నిర్లక్ష్యం మాటున.. లక్ష్యం మాయం

- గార్బేజ్ కేంద్రాలను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- గత ప్రభుత్వంలో రూ.లక్షలు వెచ్చించి నిర్మాణం
- చిన్న చిన్న పనులు పూర్తి చేస్తే వినియోగంలోకి..
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం



గార్బేజ్ కేంద్రం భవనాలు



గదుల్లో పరిస్థితి

కనిగిరిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని గార్లపేట రోడ్డులో 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.52 లక్షలతో రెండేళ్ల క్రితం నిర్మించిన గార్బేజ్ కేంద్రం వినియోగంలోకి తీసుకురాకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. చిన్న చిన్న పనులు పూర్తి చేస్తే ఈ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావచ్చు. కానీ ఆ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించలేదు.

ఉన్నత లక్ష్యం నీరుగారేలా..!

గత ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘ నిధులతో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కింద ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒకే ఏరియాకు (పెద్ద డంపింగ్ యార్డ్‌కు) చెత్త తరలించడంలో జాప్యం జరపకుండా సుమారు 20 వార్డులు కల్గి దాదాపు 84 మంది పారిశుధ్య కార్మికుల కల్గిన పంచాయతీలో వీధుల్లో చెత్త సమస్య రాకుండా ఏ రోజు ఉత్పన్నమైన చెత్తను ఆ రోజే సమీపం గార్బేజ్ కేంద్రానికి తరలించాల్సి ఉంది. అదే విధంగా మున్సిపల్ చెత్త ఆటోలు లేదా పుష్కాట్‌ల ద్వారా పారిశుధ్య కార్మికులు ఏరోజుకు ఆరోజు ఆయా సమీప వార్డుల్లోని చెత్తను డంప్ చేయాలి. ఆ తర్వాత మున్సిపల్ పెద్ద వాహనం తడి, పొడి చెత్తను వేరు చేసి ప్రధాన డంపింగ్ యార్డ్‌కు తరలించాల్సి ఉంటుంది. గార్బేజ్ కేంద్రంలో సిబ్బందికి ప్రత్యేక రూంలు కట్టించారు. భారీ షెడ్లను ఏర్పాటు చేశారు. బోర్ వెల్ వేశారు. చుట్టు ప్రహరీలతో పెయింటింగ్ చేయించారు. కేవలం అండర్ రోడ్డు, డంప్ బిన్‌లు మాత్రమే ఏర్పాటు చేయాల్సి ఉంది. సుమారు రూ.45 లక్షలకు పైగా పనులు జరిగాయి. కొద్ది పాటి ఖర్చుతో దీన్ని వినియోగంలోకి తెస్తే... పట్టణ ప్రజలకు ఎంతో ఉపయోగ పడుతుంది. 20,18, 17, 1, 2, 3, 4, వార్డులకు చెందిన చెత్తను ఈ యార్డుల్లోనే డంప్ చేయవచ్చు.

అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా..

గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ కేంద్రం ఊరికి దూరంగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రేయింబవళ్లు ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. పాలకులు, అధికారులు దృష్టి సారిస్తే ఈ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావచ్చు.



రక్షణ లేకుండా బయట వేసిన బోరు